మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# నేరస్తులపై నిఘా ఉంచాలి

- ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి
- ఫిర్యాదుదారులకు ఒకే రకమైన సేవలందించాలి
- జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మల్టీ జోన్2 ఐజి సత్యనారాయణ



జడ్చర్ల స్టేషన్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్న ఐజి సత్యనారాయణ, చిత్రంలో ఎస్పీ జానకి

**మహబూబ్‌నగగర్ బ్యూరో, డిసెంబరు 16 ప్రభాతవార్త:** పాత నేరస్తులపై నిఘా ఉంచాలని మల్టీజోన్2 ఐజి సత్యనారాయణ పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ జడ్చర్ల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఫిర్యాదుదారులందరికీ ఒకేరకమైన సేవలు అందించాలని సూచించారు. అధికారులు సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో అధిక కేసులు నమోదు అవుతున్నాయని, ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక నేరాలలో పాల్గొన్న నేరస్తులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని నిర్దేశించారు. పరిశోధనలో ఉన్న సీడీ ఫైళ్లను పరిశీలించారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు జాతీయ రహదారులు ఉన్నందున యాక్సిడెంట్ నివారణకు తగు ప్రయత్నాలు చేయాలన్నారు. ప్రతిరోజు పోలీసు అధికారులు, సిబ్బంది వ్యాయామం, యోగ, ధ్యానం, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండి, మంచి క్రమశిక్షణ సమయపాలన పాటించాలని లీడర్షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. ఐజి వెంట ఎస్పీ డి.జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ ఆది రెడ్డి మరియు సిబ్బంది ఉన్నారు.

# గ్రూప్2 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేటజిల్లా కేంద్రంలో రెండోరోజు సోమవారం జరుగుతున్న గ్రూప్2 పరీక్షాకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి వెళ్లిన ఆమె రెండోరోజు పరీక్షకు ఎంతమంది అభ్యర్థులు హాజరయ్యారని అడిగారు. అయితే ఆదివారంనాటి పరీక్ష కంటే సోమవారం జరిగే పరీక్షకు చాలామంది అభ్యర్థులు గైర్హాజర్ అయినట్లు అక్కడి అధికారి కలెక్టర్‌కు తెలిపారు. సోమవారం కేవలం 41శాతమే హాజరు ఉందని చెప్పారు. బయోమెట్రిక్ పూర్తిచేశారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులకు వెళ్లి పరీక్షా తీరును పరిశీలించారు. అభ్యర్థులకు అన్ని రకాల వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు.

# పిల్లలమర్రి పిలుస్తోంది..

- ఏడు శతాబ్దాల చరిత్ర..పాలమూరు ఐకాన్
- చెదపట్టిన మహావృక్షానికి సెలైన్‌తో పునర్జీవం
- పిల్లలమర్రికి పూర్వ వైభవం
- పర్యాటకంగా కొత్త సొబగులు




**మహబూబ్‌నగర్‌బ్యూరో, డిసెంబరు16, ప్రభాతవార్త:** పాలమూరు పేరు చెప్పినా..పిల్లలమర్రి పేరు చెప్పినా రెండు విడదీయరాని బంధం. పాలమూరు ఐకాన్‌గా పిల్లలమర్రికి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఏడు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అడవిగా ఏర్పడి నేటికీ పర్యాటకంగా విరాజిల్లుతున్నది. మహావృక్షం మొదలు నేటికీ ఓ మిస్టరీ. గత కొన్నేండ్లుగా పిల్లలమర్రికి చెదలు పట్టి ఒక్కో కొమ్మ విరిగిపడుతుండగా గుర్తించి అధికారులు యంత్రాంగం సెలైన్ ఎక్కించి మరీ పునర్జీవం పోశారు. మళ్లీ జీవం పోసుకొని సందర్శకులకు స్వాగతం పులకుతూ పర్యాటకంగా నూతన సొబగులు అద్దుకుంటున్న మన పిల్లలమర్రి.

**మొదలు నేటికీ ఓ మిస్టరీ..**

ఏడు శతాబ్దాల చరిత్ర కలిగిన పిల్లలమర్రి మళ్లీ జీవం పోసుకుంటున్నది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే పిల్లలమర్రి ఉండే మర్రిచెట్టు ఎప్పుడు పుట్టిందనే విషయంపై నేటికీ కచ్చితమైన సమాచారం ఎక్కడా లేదు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ నుంచి ఉన్న ధ్రువీకరణ మేరకు 700ఏళ్ల నాటి వృక్షం అని మాత్రం నిర్ధారించారు. భారత దేశంలోని అతిపెద్ద మర్రిచెట్లలో ఇది ఒకటని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ చెట్టు సుమారు నాలుగు ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ చెట్టును మొదట పీర్ల మర్రిగా పిలిచేవారు. కాలక్రమంలో పిల్లలమర్రిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. చెట్టు శాఖోపశాఖలుగా విస్తరించడంతో దీని మొదలు ఎక్కడ అనేది తెలుసుకోలేనంతగా మారింది.

**సెలైన్‌తో పునర్జీవం..**

మహబూబ్‌నగర్ శివారులో ఉండే పిల్లలమర్రి ప్రధాన శాఖ ఒకటి కొన్నేండ్ల కిందట నేలమట్టం కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆర్కియాలజీ, వృక్షశాస్త్ర అధికారులు, అటవీ శాఖ అధికారులు చెట్టుకు చెదలు పట్టడంలో పరిశోధలు జరిపి, శతాబ్దాల చరిత్ర కలిగిన పిల్లలమర్రిని కాపాడుకొనేందుకు సెలైన్ సీసాలు వాడుతూ చికిత్స అందిస్తున్నారు. చెదలు పట్టడంతో ఇది దెబ్బతింటోంది. ఊడలు, శాఖలు విరిగిపోతున్నాయి. దీంతో, చెట్టుకు చికిత్స అందించేందుకు వృక్ష సంరక్షణ నిపుణులు వివిధ చర్యలు చేపడుతున్నారు. నిపుణు లు క్లోరోపైరఫస్‌ఖి అనే చీడనివారణ మందును పిచికారీ చేయించడంతో పాటు, దానిని సెలైన్ బాటిళ్లలో నింపి చెట్టు కాండం ద్వారా వివిధ శాఖలకు అందేలా చూస్తున్నారు. చెట్టు స్థితిపై నిరంతర పర్యవేక్షణ పెట్టారు. ఈ చర్యలతో పిల్లలమర్రి క్రమంగా కోలుకుంటోంది. చెట్టుకు సారవంతమైన మట్టి, ఎరువు అందిస్తూ, క్రిమిసంహారక మందులు పోస్తూ ఆరోగ్యాన్ని సంతరించుకొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. నేల వాలుతున్న ఊడలను చీడ సోకకుండా నేరుగా భూమిలోకి పాకే విధంగా సిబ్బంది పైపులు ఏర్పాటు చేయగా, చెట్టు మొదళ్ల కిందకు ఒరగకుండా సిమెంటు దిమ్మెలు సపోర్ట్‌గా ఉంచారు. మర్రిచెట్టును చెదపురుగులు తొలచివేయడంతో ఒక భారీ కొమ్మ ఒకటి విరిగిపడింది. దీంతో ఆరేండ్లుగా చెట్టు వద్దకు సందర్శకులను అనుమతించడం ఆపేశారు. అప్పటి మహబూబ్‌నగర్ -మిగతా4లో..

# రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా పేరు నిలపాలి

- సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభంలో మహబూబ్‌గర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- 21వరకు జిల్లా స్థాయిలో కొనసాగనున్న పోటీలు



బాస్కెట్ బాల్ గోల్ వేస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 16 ప్రభాతవార్త:** గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో స్టేడియం గ్రౌండ్‌లో సిఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. ఈనెల 21వరకు జిల్లా స్థాయి పోటీలు, ఎంపిక నిర్వహిస్తున్నట్లు, ఈనెల20న ఉమ్మడిజిల్లాకు సంబంధించి హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీలు మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలను జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ 36 క్రీడలు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబంలోని విద్యార్థులను ప్రోత్సహించి వారి ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, నెట్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్, కిక్ బాక్సింగ్, బాస్కెట్‌బాల్ 8 క్రీడలలో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా యువజనక్రీడల అధికారి శ్రీనివాస్ ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శాంతాబాయి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జాకీర్, నెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విక్రమ్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఖాజా, పేట రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ పాల్గొన్నారు.

# పురిటి నొప్పులతోనే గ్రూప్2 పరీక్షకు..

## కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది



ఆసుపత్రికి చేరుకున్న రేవతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** గ్రూప్ 2 పరీక్షలు రాస్తున్న గర్భవతికి ఒక్కసారిగా పురిటి నొప్పులు రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమై అంబులెన్స్‌ను వైద్య సిబ్బంది ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన గర్భవతి రేవతి సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పి బాలురు పాఠశాలలో పరీక్ష రాసేందుకు వచ్చింది. మొదటి పేపర్ రాస్తుండగా పురిటి నొప్పులు వచ్చిన పరీక్ష కొనసాగించింది. మధ్యాహ్నం రెండు పేపర్ 2 రాసేందుకు సిద్ధం కావడంతో అక్కడ ఉన్న అధికారులు కలెక్టర్‌కు సమాచారం చేరవేయడంతో, తనకోసం ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. పరీక్ష కేంద్రం దగ్గరనే ప్రత్యేకంగా అంబులెన్స్‌ను వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. పురిటి నొప్పులతోనే పరీక్షలు రాస్తుండడంతో ఉద్యోగం సాధించాలన్న ఆమె పట్టుదలను చూసి అందరూ అభినందించారు.

# విధులలో నిర్లక్ష్యం

## ప్రధానోపాధ్యాయునికి మెమో జారి

**రాజాపూర్ డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం గుండ్లపొట్లపల్లి యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రఘునందనరావు తరచుగా పాఠశాల విదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాంరెడ్డి, మండల విద్యాధికారి ఏ.సుధాకర్ పర్యవేక్షణలో పలుమార్లు ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంలో ఆయన పాఠశాల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలిసిందని సోమవారం అతనికి మెమో జారీ చేస్తూ రెండు రోజులలోగా సంజాయిషీ కోరినట్లు మండల విద్యాధికారి ఏ.సుధాకర్ తెలిపారు.

# క్రీడలు విద్యార్థుల్లో సంకల్ప శక్తిని పెంచుతాయి



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న కలెక్టర్, ఎస్పీ

**గద్వాల, డిసెంబరు 16 ప్రభాతవార్త :** క్రీడలు మనలో సంకల్పశక్తి, ఒడిదుడుకులను అధిగమించే సామర్థ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం నందు జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీఎం కప్ 2024 క్రీడా పోటీలలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాకుండా విద్యా, వ్యక్తిత్వ వికాసానికి ముఖ్యమని, ఐ.ఎ.ఎస్, ఐపీఎస్ వంటి ఇంటర్వ్యూలో కూడా క్రీడలపై ప్రశ్నలు అడుగుతారని తెలిపారు. క్రీడల ద్వారా టీం వర్క్, నాయకత్వం, సంకల్పశక్తి వంటి అనేక విలువలు నేర్చుకోవచ్చని, ఇవి ప్రొఫెషనల్ జీవితంలో మరింతగా ఉపయోగపడతాయని అన్నారు. వ్యక్తిగతంగా విజయం సాధించడం కంటే టీమ్‌గా కలిసి పనిచేయడం చాలా ముఖ్యమని, ఇది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరులో కూడా ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రస్తుతకాలంలో పెరుగుతున్న పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేపథ్యంలో క్రీడలు మన ఆలోచనా విధానాన్ని మెరుగుపరుస్తాయని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడా స్ఫూర్తి, సంకల్పశక్తి, ఒడిదుడుకులను ఎదుర్కొనే సామర్థ్యం క్రీడల ద్వారా పెరుగుతాయని, ఇవి మన జీవితంలో ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు. గ్రామ, మండల స్థాయిలో గెలిచి జిల్లా స్థాయికి ఎంతో కష్టపడి వచ్చిన క్రీడాకారులు, అదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో కూడా గెలిచి జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం వినోదం కాదుని ప్రతిభను మరింత ఎత్తుకు తీసుకెళ్లే వేదిక కావాలని, ఆ తర్వాత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడలు మనిషి జీవితంలో విజయాలను సాధించడానికి అనేక కీలకమైన నైపుణ్యాలను నేర్పించి, వాటి ద్వారా జీవితంలో ప్రతి సమస్యను సమర్థంగా ఎదుర్కొనడంలో సహాయపడతాయన్నారు. క్రీడలో ఓడిపోయినా, మళ్లీ లేచి విజయం కోసం పోరాటం చేయడం నేర్చుకుంటామని అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి, ఆపై దేశ స్థాయికి చేరుకోవాలన్నారు. ఒలింపిక్స్ వరకు చేరే లక్ష్యాన్ని 4 సంవత్సరాలలో సాధించేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం నైపుణ్యాలపై శ్రద్ధ పెడితే, విజయం సాధిస్తారని అన్నారు. గెలిచేవారు మాత్రమే కాదు, ఓడిపోయేవారు కూడా క్రీడలో గెలిచినవారే, అందరినీ క్రీడలో భాగస్వాములుగా మార్చి జీవితంలో అద్భుతమైన విజయాలను సాధించాలన్నారు. జాతీయ స్థాయిలో రగ్బీ, షూటింగ్ బాల్ విజేతలను అభినందించి, వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ ఫైనలిస్టులను, బాలురు, బాలికలను జిల్లా కలెక్టర్, ఎస్పీ వారి కృషిని ప్రశంసించి, ఫైనల్ మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ స్వయంగా వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, జిల్లా క్రీడాల అధికారి బి.ఎస్ ఆనంద్, పి.ఈ.టి లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలుషిత జలాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి

## అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబరు 16 ప్రభాతవార్త :** జడ్చర్ల సెజ్‌లోని అరబిందో ఫార్మా కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతోందనే విషయాన్ని తాను ఇదివరకే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినా ఆ కంపెనీ కలుషిత జలాలను వదలడం ఆపలేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చెప్పారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో అనిరుధ్ రెడ్డి పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ముదిరెడ్డిపల్లి చెరువులోకి కాలుష్య జలాలపై మాట్లాడారు. అరబిందో పరిశ్రమ నుంచి వర్షపు నీటితో పాటు కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతున్న కారణంగా చెరువులో చేపలు మరణిస్తున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గత జూలై 30 న జరిగిన అసెంబ్లీ సమావేశంలోనూ చెప్పడం జరిగిందని గుర్తు చేసారు. అయితే తాను సభలో ఈ విషయాన్ని గురించి ఫిర్యాదు చేసిన తర్వాత కూడా అరబిందో పరిశ్రమ - మిగతా4లో..

# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

## అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్



ఇందిరమ్మ ఇళ్ల సర్వే పై వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 16 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల సర్వే గురించి దరఖాస్తు దారులకు ముందురోజు సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. ప్రజాపాలన ద్వారా ఇళ్ళు లేని వారు ఇందిరమ్మ ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను గ్రామాల్లో, మున్సిపాలిటీలో క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నప్పుడు దరఖాస్తుదారులకు ముందురోజు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి అన్ని డాక్యుమెంట్లు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపీడీఓ లు, ఎంపీఓ లతో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే పై పలు సూచనలు చేశారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఉన్న ఇంటి ఫోటో తీసుకోవాలని అది కాంక్రీట్ స్లాబ్ ఉందా పెంకుటిల్లు ఉందా అనేది ఫోటోలో కనిపించాలి అన్నారు. ప్రజాపాలన ద్వారా దరఖాస్తు చేసుకునే నాటికి అద్దె ఇల్లు మారి ఉంటే ప్రస్తుతం ఉన్న ఇంటి వద్దకు వెళ్లి సర్వే చేయాలని సూచించారు. ఒకవేళ వేరే ప్రాంతంలో వలస వెళ్లి ఉంటే ఫోన్ చేసి పిలిపించాలని తెలిపారు. దరఖాస్తుదారునికి ఇల్లు కట్టుకోడానికి ఖాళీ స్థలం ఉందా ఉంటే అందుకు సంబంధించిన – మిగతా3లో..

# పోలీస్ స్టేషన్ స్ట్రాంగ్ రూమ్ నుండి ప్రశ్నపత్రాల తరలింపు

- గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం
- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ప్రశ్న పత్రాల తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ నుండి మధ్యాహ్నం నిర్వహించే గ్రూప్-2, పేపర్, 4 పరీక్షకు నిర్వహించే ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ దేవసహాయం, అదనపు ఎస్పి రామేశ్వర్, సంబంధిత అధికారుల సమక్షంలో 5 రూట్ల వారీగా ప్రశ్నాపత్రాల తరలించే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రశ్నపత్రాల తరలించే వాహనంతో పాటు కలెక్టర్ బయలుదేరి, పట్టణంలోని సాధన డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రం వరకు వెళ్లి, ప్రశ్న పత్రాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఎన్ని గంటలకి ఓపెన్ చేస్తారని అధికారులతో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాధన డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. జిల్లా కేంద్రంలోని సాధన డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎ ఒక్కరి సెల్‌ఫోన్లను అనుమతించొద్దని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భద్రత చర్యలను అత్యంత జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందని తెలిపారు.

# ప్రజావాణి వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 21 ఫిర్యాదులు వచ్చాయని, అట్టి అర్జీలను వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధితశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏడి సర్వే ల్యాండ్ కు 3 ఫిర్యాదులు, డిఆర్డీఏకు 2, ఉపాధి కల్పనకు 2, జిల్లా శిశు సంక్షేమ శాఖకు 2, విద్యాశాఖ, లేబర్, ఎల్డీఎం, పోలీస్ శాఖలకు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు అందాగా మిగిలిన ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ చేన్న కిష్టయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డిఐజి

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు.. సెక్షన్163 బిఎన్ఎస్ఎస్ (144సెక్షన్) అమలు**


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డిఐజి ఎల్ ఎస్ చౌహాన్

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 16 ప్రభాతవార్త :** 2వ రోజు గ్రూప్–2 రాతపరీక్షలకు సంబంధించి వనపర్తి జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను జోగులాంబ జోన్ డిఐజి ఎల్ ఎస్, చౌహాన్ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి పరిశీలించారు. పరీక్ష సరళిని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పరిశీలించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను పర్యావేక్షించి పోలీసు అధికారులు, సిబ్బంది అందరు బాధ్యతగా పని చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూము కు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని డిఐజి సూచించారు. డిఐజి తో పాటు వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు,వనపర్తి సీఐ, క్రిష్ణ,తదితరులు ఉన్నారు.

## డిఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

**అమరచింత డిసెంబరు 16 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్ మాట్లాడుతూ, మార్చిలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతి ఏడాది ప్రత్యేక ప్రేరణ తరగతులకు 40 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వారికి ఉదయం టిఫిన్ డిఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. విద్యార్థుల బాగా చదువుకుని ఉన్నంత స్థాయికి ఎదగాలని లక్ష్యంతో డిఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మాజీ అడ్వకేట్ జనరల్ దేశ ఐ ప్రకాశ్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ చిన్న వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కర్ణాకర్ ,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల ఛలో హైదరాబాద్

**మాగనూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం,పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడిదల చేయాలని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు స్థానంలో రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిపెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 17 మంగళవారం రోజు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూర్ ఆంజనేయులు కార్మికులను కోరారు . గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, వెలుతురులో ఉంచడంలో, మంచినీటి సౌకర్యం అందించడంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబర్,బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను 2వ పిఆర్సి పరిధిలోకి తీసుకువచ్చి కనీస వేతనము 18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రైతు ప్రభుత్వ ఉద్యోగం సాధించినందుకు సన్మానం

**మాగనూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కొల్పూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కొల్పూర్, మందిపల్లి, పర్మన్డొడ్డి , గజరందొడ్డి,అడవి సత్యరం గ్రామానికి చెందిన రైతులు కొల్పూర్ ఫస్ట్ లిఫ్ట్ దగ్గర రైతు బిడ్డగా పేరు పొందిన మందిపల్ గ్రామానికి చెందిన యాంకే నాగేశ్వర్ 2024డీఎస్సీలో ఎస్జిటి స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం పొందినందుకు వివిధ గ్రామ రైతులు అందరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ స్వామి గౌడ్ మాట్లాడుతూ యాంకే నాగేశ్వర్ గత కొన్ని సంవత్సాలుగా మన మధ్యలో రైతు బిడ్డగా ఉంటూ ఈరోజు ప్రభుత్వం ఉద్యోగం సంపాధించినందుకు రైతు బిడ్డగా చాలా సంతోషిస్తున్నాను అన్నారు. అలాగే ఇంకా ముందు ముందు ఇలాగే మన రైతుల బిడ్డలు గవర్నమెంట్ ఉద్యోగం సాధించాలని వారిని కూడా కుల మతాలకు అతీతంగా అన్ని విధాలుగా సహాయంగా ఉంటానని తెలిపారు. అదేవిధంగా టీచర్ హుసేనప్ప మాట్లాడుతూ గతంలో నాగేశ్వర్ రైతు బిడ్డగా ఉంటూ రైతుల కోసం మండలంలో అనేక సమస్యలతో పోరాడి ఈరోజు ఒక రైతు బిడ్డ ప్రభుత్వ జాబ్ సంపాదించడం ఎందరికో ఆదర్శం అని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పై గ్రామాల ప్రజలు పాల్గొని యాంకే నాగేశ్వర్ టీచర్ నీ ఘనంగా సన్మానించారు.

## డయాలసిస్ సెంటర్

## ఏర్పాటు కోసం వైద్యారోగ్యమంత్రికి వినతి

**మక్తల్, ఆత్మకూరులలో ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**


మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు ఆత్మకూరులోనూ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి వినతి పత్రం అందించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి కార్యాలయంలో దామోదర్ రాజనర్సింహను కలిసి మక్తల్ నియోజవర్గంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు సుమారు 100కు పైగా కిలోమీటర్లు ప్రయాణించి డయాలసిస్ సేవలు పొందాల్సి వస్తుందని, ఇది డయాలసిస్ రోగులకు చాలా ఇబ్బందిగా మారిందని తెలియజేశారు. వెంటనే మక్తల్ ఆత్మకూరులలో డయాలసిస్ సెంటర్లను ప్రారంభించి, డయాలసిస్ రోగులకు ఉపశమనం కలిగించాలని విన్నవించారు. స్పందించిన వైద్యాలకు శాఖ మంత్రి వెంటనే అధికారులను పిలిపించే మక్తల్ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు కోసం కావాల్సిన చర్యలను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా డయాలసిస్ సెంటర్లు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలియజేశారు.

## మన్యంకొండలో ధనుర్మాసం పూజలు ప్రారంభం

**నెలరోజుల పాటు తిరుప్పావై శ్లోకాల పఠనం**

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త :** మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాసం పూజలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది దేవస్థానంలో ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ధనుర్మాసం పూజలు దేవాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో పురోహితులు తిరుప్పావై శ్లోకాలను పఠించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పాటు దేవస్థానం పురోహితులు తదితరులు పాల్గొన్నారు. దాదాపు నెల రోజులపాటు పురోహితులు ఈ శ్లోకాలను పఠిస్తారు. ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 7 గం.ల వరకు భక్తులకు దేవస్థానంలో దర్శనం ఉంటుందని దేవస్థానం చైర్మన్ వ్యవస్థాపక ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాస్ రాజు తెలిపారు.

## రోడ్డుపై రోడ్డు కాలనీ వాసులకు తప్పని పాట్లు

**పెబ్బేరు డిసెంబరు 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో 11వ వార్డు లో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతున్నది పాత రోడ్డు తవ్వకుండానే కొత్త రోడ్డు వేస్తుండటంతో తిప్పలు తప్పడం లేదని పెబ్బేరు పట్టణవాసులు వాపోతున్నారు. మున్సిపల్ పాలకవర్గం తమ పదవీ కాలం ముగుస్తోందన్న తొందరలో పలు కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. కానీ ఈ రోడ్ల నిర్మాణం ప్రజలకు కొన్ని చిక్కులను తెచ్చిపెడుతోందని పట్టణవాసులు గగ్గోలు పెడుతున్నారు. అయినా కాంట్రాక్టర్లు కాని, కౌన్సిలర్లు కానీ అవేమీ పట్టించుకోకుండా రోడ్లను ఇష్టారీతిగా వేయిస్తున్నారు. పాత రోడ్లను తొలగించకుండా అదే రోడ్డుపై మళ్లీ కొత్తగా రోడ్డును ఇళ్ల కంటే హైట్ ఎక్కువగా వేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో వాన నీరు ఇళ్లలోకి చేరి తమకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పినా వినకుండా రోడ్లు వేస్తున్నారని ఫైర్ అవుతున్నారు. త్వరలో రానున్న మున్సిపల్ ఎలక్షన్ లోను దృష్టిలో ఉంచుకొని ఓట్లు దండుకోవడానికి నామమాత్రపు పనులు చేస్తూ ఇక్కట్లకు గురిచేస్తున్నారని పట్టణవాసులు అంటున్నారు. ఈ విషయమై వైస్ చైర్మన్ కర్రె స్వామిని వివరణ కోరగా గతంలో రోడ్లు తవ్వి వేసేవారు. ఇప్పుడు ఆ సిస్టమ్ పోయింది అని చెప్పారు. ఇంజనీర్లు అవన్నీ చూసుకుంటారని ఆయన చెప్పారు.

## భక్తిపారవశ్యంతో పులకించిన చిన్నరాజమూర్

- వైభవంగా అంజనేయస్వామి రథోత్సవం
- సాంప్రదాయరీతిలో కోనేరులో అవభృతస్నానం
- గజవాహనంపై తేరుమైదానికి వచ్చిన స్వామివారు
- రథంపై ఊరేగుతూ భక్తకోటికి స్వామివారి దర్శనం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- దాసంగాలతో స్వామివారికి నైవేద్యాలు


చిన్నరాజమూర్‌లో స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ సోమవారం భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్స వాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్స వాన్ని తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామివారి గజవాహనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని గజవాహనంపై దేవస్థానం చుట్టూ ఊరేగించారు. పురోహితుల వేధమంత్రాలు,సన్నాయి వాయిద్యాలు,భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ ప్రదిక్షణల అనంతరం స్వామి వారిని అదే గజవాహనంపై దేవస్థానం ముందున్న తేరుమైదానానికి ఊరేగింపుగా తీసుకవచ్చారు. అనంతరం ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగించారు.బ్యాండు వాయిద్యాలు,భక్తుల హరినామశ్చరణ,శివసత్తుల పూనకాలు,బాణాసంచ పేలుళ్ళ మధ్య ఈ రథోత్స వం ముందుకు కదిలింది.పురోహితులు శాస్రోక్తంగా ఈపవిత్ర ఘట్టాన్ని నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు.ఈ సందర్భంగా అలంకరణలో స్వామి వారు దేవస్థానం ఆవరణలో రథంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఇతర రాష్ట్రాలతో పాటు ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కొన్ని వేల మంది భక్తులు స్వామి వారి రథోత్స వాన్ని కనులారా తిలకించి తన్మయం చెందారు.

**ఘనంగా పవళింపుసేవ..**

రథోత్స వం అనంతరం దేవస్థానంలో స్వామి వారి పవళింపుసేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్స వం అనంతరం స్వామి వారిని దేవస్థానంలోకి తీసుక వచ్చి ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ఊయలలో స్వామి వారిని ఉంచి ఈకార్యక్ర మాన్ని నయనానందంగా నిర్వహించారు. స్వామి వారిని ఊయలలో పరుండబెట్టి వివిధ దైవగీతాలను ఆలపించారు. అలాగే మహాఅలంకరణ,పంచామృతాభిషేకం,వివిధ పూజలు నిర్వహించారు.

**వైభవంగా అవభృతస్నానం..**

చిన్నరాజమూర్‌లో దేవస్థానం కోనేరులో స్వామి వారి అవభృతస్నానం పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పల్లకిలో దేవస్థానం నుండి కోనేరు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్ళి ఈ కార్యక్రమాన్ని పురోహితులు నిర్వహించారు. దైవనామాన్ని స్మరిస్తూ ఈ పూజా కార్యక్రమాన్ని శాస్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకరకాల పూలతో పాటు వివిధ ఆభరణాలతో సార్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్స వ విగ్రహాన్ని కూడ అలంకరించారు.

**దాసంగాలతో స్వామి వారిని నైవేధ్యాలు..**

చిన్నరాజమూర్‌లో వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిర భక్తులు ఉపవాసదీక్షలతో వచ్చి స్వామి వారికి దాసంగాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. తీపివంటకాలతో స్వామి వారికి నైవాధ్యాలు సమర్పించారు. దీంతో దేవస్థానం పరిసరాలు భక్తులు కిటకిటలాడాయి.వివిధ ప్రాంతాలనుండి భక్తులు బస్సులు,ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు,వివిద వాహనాలలో చిన్నరాజమూర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా దేవస్థానాన్ని వివిద రంగురంగుల విధ్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.

## అట్టహాసంగా సిఎం కప్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

**క్రీడాజ్యోతి, జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం సీఎం కప్ 2024 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ క్రీడాజ్యోతిని వెలిగించి, జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. అంతకు ముందు వేదికపై సరస్వతీ మాత, ద్యాన్ చంద్ చిత్రపటాలకు కలెక్టర్ పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలోని 11 మండలాలతో పాటు మూడు అర్బన్ జట్ల క్రీడాకారులు కలెక్టర్ కు గౌరవ వందన ( మార్చ్ ఫాస్ట్) చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూగ్రామపంచాయతీ, మండల స్థాయి పోటీలలో గెలిచిన వారికి జిల్లాస్థాయిలో నేడు పోటీలు జరుగుతున్నాయని, ఇక్కడ గెలిస్తే రాష్ట్ర స్థాయికి వెళ్తారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను, యువతను ఎంతో ప్రోత్స హిస్తున్నారని అన్నారు. క్రీడలపరంగా నారాయణపేట జిల్లాకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రెజ్లింగ్ పోటీలలో జోనల్ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లాలో ఉన్నారన్నారు. ఈ సీఎం కప్ ద్వారా ముందుకు వచ్చిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రోత్స హించడం జరుగుతుందన్నారు. వాలీబాల్ పోటీలలో మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయని, మార్చ్ పాస్ట్ నిర్వహణతోనే క్రీడాకారులకు మంచి క్రమశిక్షణ ఉందనే విషయం తెలుస్తోందన్నారు. జిల్లాలో నాలుగు రోజులపాటు వివిధ క్రీడలలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు తాగునీటి భోజన, ఇతర వసతులను కల్పించాలని నిర్వాహకులకు ఆమె సూచించారు. క్రీడా పోటీలకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులను( క్రీడాకారులను) జాగ్రత్తగా చూసుకోవాల్సి న బాధ్యత ఆయా పాఠశాలల ఉపాధ్యాయులదే అని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ కోస్గి, ఉట్కూర్ బాలికల వాలీబాల్ పోటీలను, నారాయణపేట రూరల్ దామరగిద్ద బాలుర జట్ల మధ్య పోటీలను వాలీబాల్ సర్వీస్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, ఎస్.జి.ఎఫ్. జిల్లా కార్యదర్శి గొడుగు నర్సిములు, డిపిఆర్ఓ ఎంఏ రషీద్, ఎస్. సి.కార్పొరేషన్ ఈడీ మహమ్మద్ ఖలీల్, మక్తల్ మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్, పేట మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టాడ్, ఎంఈఓలు, రిటైర్డ్ పిఈటి గోపాలం, వ్యాయామ ఉపాధ్యాయులు సాయినాథ్, రమణ, బాలరాజ్, కతలప్ప, వెంకటేష్, అక్తర్ పాషా, వెంకటప్ప, పారిజాత, అనంతసేన సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధికోసమే తెరపైకి దేవరకద్ర మున్సిపాలిటి

**- బిజేపి నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఆరోపణ**

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** కేవలం రాజకీయలబ్దికోసమే తెరపైకి దేవరకద్ర మున్సిపాలిటి ఏర్పాటును తీసుకవస్తున్నారని దేవరకద్ర బిజేపి నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు.ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య ఇది కాదన్నారు. దేవరకద్రలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొండ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు.దేవరకద్ర మున్సిపాలిటి ఏర్పాటైతే ప్రజలకు నష్టమేగాని లాభం ఏ మాత్రం కాదన్నారు.దేవరకద్ర మున్సిపాలిటి ఏర్పాటుకు ఎప్పుడు కూడ బిజేపి వ్యతిరేకం కాదన్నారు.కాకపోతే ఇప్పట్లో ఇది అవసరం లేదన్నారు.దీనికి ఇంకా చాలా సమయం ఉందన్నారు.ఒక వేళ దేవరకద్ర మున్సిపాలిటిగా ఏర్పాటైతే ప్రజలకు చాలా నష్టం వాటిల్లుతుందన్నారు.ఈజిఎస్ పూర్తిగా నిలిచిపోతుందన్నారు.అలాగే ట్యాక్సులు కూడ పెరిగి వ్యాపారస్థులు,ప్రజలు చాలా ఇబ్బందుల పాలవుతారన్నారు.సామాన్య ప్రజలు నరకం చూడాల్సివస్తుందన్నారు.వీటన్నిటిని దృష్టిలో పెట్టుకోకుండా గుడ్డిగా దేవరకద్రను మున్సిపాలిటిగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.ఇంకా 10 ఏళ్ళ వరకు కూడ మున్సిపాలిటి అవసరంలేదన్నారు.మున్సిపాల్టిగా మారితేనే ఆదాయం వస్తుందనుకోవడం భ్రమ అని అన్నారు.ఇప్పుడు కూడ స్థానిక మేజర్ గ్రామపంచాయతీలో వేరే గ్రామాలకు ఇచ్చేటంతా చాలా నిధులు ఉన్నాయన్నారు.ప్రధాన సమస్యలు వదిలిపెట్టి కేవలం దేవరకద్ర మున్సిపాలిటి ఏర్పాటుకే ఎందుకు ప్రధాన్యత ఇస్తున్నారన్నారు.ప్రజాభిప్రాయం తీసుకొన్న తర్వాతనే మున్సిపాలి టిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్లైఓవర్ ఏర్పా టుతో దేవరకద్రలో బస్టాండు లేక ప్రజలు,ప్రయాణికులు ఇబ్బంది లు పడుతుంటే ఎవ్వరు కూడ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బస్టాండు ఏర్పాటుకు స్థలం ఉందని చెబుతుంటే కూడ పెడచెవిన పెడుతున్నారన్నారు.దీనిని బట్టి చూస్తే పాలకుల పనితీ రు ప్రజలకు అర్థమవుతుందన్నారు.

**షాపింగ్ కాంప్లెక్స్‌ప్రారంభానికి ఎందుకు జాప్యం..**

దేవరద్రలో శ్రీ ఈశ్వరవీరప్పయ్య దేవస్థానానికి సంబందించిన షాపింగ్‌కాంప్లెక్స్ సమదాయాన్ని ప్రారంభించడానికి తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు.కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే వీటిని ప్రారంభించడం లేదని ఆయన విమర్శించారు.దీని వల్ల గత రెండేళ్ళుగా దేవస్థానానికి రావాల్సి లక్షల ఆదాయం రాకుండా పోయిందన్నారు.ఆ లోటును పూడ్చాల్సిన భాద్యత గత,ప్రస్తుత పాలకులపై ఉందన్నారు.ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మండల కేంద్రాలలో,రావాణసౌకర్యాం ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా అడవిలో ఏర్పాటు చేయడం తగదన్నారు.దేవరకద్రలో సర్వీసురోడ్లు ఏర్పాటు చేయకుండానే ఆఘమేఘాలమీద ప్లైఓవర్ వంతెన ఏర్పాటు చేశారన్నారు.దీంతో సర్వీసురోడ్లు లేక పట్టణప్రజలు నానా ఇబ్బందుల పాలవుతున్నారన్నారు.ఇలాంటి ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరలో అందోళన కార్యక్రమాలు ప్రారంభించడానికి ఓ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.ఇవన్నిప్రజలపక్షాన అడుగుతున్నామే తప్ప ఇందులో ఎటువ ంటి రాజకీయ దురుద్ధేశ్యం లేదని కొండ ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు

**వీపనగండ్ల డిసెంబరు16 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మఇండ్లు ఇవ్వాలని సిపిఎం గోవర్ధనగిరి గ్రామపంచాయతీ కార్యాల యం ముందు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగింది రిలే నిరాహార దీక్షలు ప్రారంభంకంటే ముందు డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ విగ్రహానికి మహిళా నాయకులు పూలదండవేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం జరిగిన రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తూ సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇండ్లు లేని ప్రతి పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఇంటి స్థలం, ఇంద్రమ్మ ఇండ్లు నిర్మిస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేయడం జరిగింది. సిపిఎం గోవర్ధన్ గిరి గ్రామ కమిటీ నాయకులు గ్రామంలో సర్వే చేస్తే ఇప్పటికీ గుడిసెలు,రేకులు ఇండ్లలో 47 మంది కుటుంబాలు ఉన్నారు, ఒక ఇంట్లో ఇద్దరు ముగ్గురు అన్నదమ్ములు పెళ్లిలై కుటుంబాలు జీవిస్తున్న వారు 100 మంది పైగా ఉన్నారన్నారు.కాబట్టి ప్రతి ఊరికి మొదటి దపాల్లోని 100 ఇండ్లు కేటాయించగలిగితే అర్హులైన వారందరికీ ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు,కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇచ్చి ఇండ్లు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ పార్టీ నాయకులు డబుల్ బెడ్ రూములు ఇస్తామని మోసం చేశారు. మీరు కూడా అదే పద్ధతిలో చేయకుండా అరులైన వారందరికీ ఇవ్వాలని అన్నారు. ఇల్లు కేటాయింపుల్లో రాజకీయాలకతీతంగా పేదవారిని గుర్తించి ఇవ్వాలన్నారు.ఇవ్వని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎండి మహబూబ్ పాషా, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం కవిత, సిపిఎం గ్రామ కార్యదర్శి బి రవి ప్రసాద్, మాజీ సర్పంచ్ కాంతమ్మ,గ్రామ నాయకులు ఖాజా హుస్సేన్, ఎండి మోలాలి,శంకర్, కురుమయ్య, రేవతమ్మ, లక్ష్మి, సరోజ,వెంకటమ్మ, బాలేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐజెయూ మండల అధ్యక్షుడిగా మల్దే మహేష్ ఎన్నిక

**టీయూడబ్ల్యూజె (ఐజెయూ) మండల నూతన కార్యవర్గం ఎన్నిక**

**రాజాపూర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల టియుడబ్ల్యూజె (ఐజేయు) అధ్యక్షుడిగా మల్దే మహేష్‌ను ఎన్నుకున్నారు. ఐజెయూ జిల్లా అధ్యక్షుడు దతేందర్ సూచన మేరకు నియోజకవర్గం అధ్యక్షుడు రాచాల నరేందర్ అధ్యక్షతన సోమవారం రాజాపూర్ మండల కేంద్రంలోని జెకెఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల నూతనకమిటీని ఎన్నుకున్నారు.ఈసందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు రాచాల నరేందర్ మాట్లాడుతూ ఐజెయుయూనియన్ దేశవ్యాప్తంగా చరిత్రగల యూనియన్ అని,ఏడుదశాబ్దాలుగా జర్నలిస్టులకు సేవలు అందిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విద్యా వైద్యానికి సంబంధించి రాష్ట్ర కమిటీ ప్రత్యేక పాలసీ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.నూతనమండల అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవం ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్య దర్శి సందీప్,జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధానకార్యదర్శి కావలి శివప్రసాద్ ఆంధ్రప్రభ దినపత్రిక,కోశాధికారి మలగలభీమయ్య విజయకాంత్రి దినపత్రిక,ఉపాధ్యక్షులు కుమ్మరిహరీష్ దిశాదినపత్రిక,గౌరవఅధ్యక్షులు నేరెళ్ల గణేష్‌గౌడ్ సాక్షి దినపత్రిక,ఈ సిమెంబర్స్ కమ్మరిసతీష్ గ్రేట్ తెలంగాణ, మల్దే మల్లేష్ వార్త దినపత్రిక, ముస్తఫా బోళ్ల రాఘవేందర్ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎన్నుకోవడం జరిగింది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్

**ఖిల్లాఘణపురం డిసెంబరు 16 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రోడ్డు మీద తండాకు చెందిన దేవిజా నాయక్ తల్లి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని సోమవారం బాధిత కుటుంబాన్ని ఏఐసిసి రాష్ట్ర కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పరామర్శించారు. మృతురాలు భామిని చిత్రపటానికి పూలమాలవేసి దేవి జాను ఓదార్చి మనోధైర్యం చెప్పారు.ఆయన వెంబడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు గంజాయి రమేష్, డాక్టర్ నరేందర్ గౌడ్ యాదగిరి, అజీమ్, గోవిందు, మున్నూరు జయకర్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ


అయ్యప్ప స్వాముల ఊరేగింపు

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త :** లాల్ కోటలో శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహ పడిపూజ కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. లాల్ కోట అయ్యప్ప సేవా సమితి, వడ్ల గోవర్ధన్ చారి గురుస్వామి, లాల్ కోట కెంగూర్ అంజన్న యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలో అయ్యప్ప స్వాములు స్వామివారికి పలుఅభిషేకాలు నిర్వహించారు.దైవ గీతాలు ఆలపిస్తూ తన్మయం చెందారు.ఈకార్యక్రమంలో అయ్యప్ప స్వాములతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెరుగైన చికిత్స కోసం ఎల్ఓసీ అందచేసిన ఎమ్మెల్యే

**పెబ్బేరు డిసెంబరు 16 ప్రభాతవార్త :** పెబ్బేరు మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన గణేష్ కు గుండెకు సంబంధించిన వ్యాధితో హాస్పిటల్లో ఉన్నాడు. స్థానిక నాయకుల ద్వారా సమాచారము తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆ బాలుడి మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స కోసం(ఒక లక్ష )రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించారు. ఈ ఎల్ఓసిని నేడు పెబ్బేరు మండల లో ఎమ్మెల్యే పెబ్బేరులో బాధితునికి అందచేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్ ,మార్కెట్ రైతు చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వర్కింగ్ సాగర్ రంజిత్ కుమార్ ,మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, యుగంధర్ రెడ్డి ,సత్యనారాయణ రెడ్డి ,శివ కుమార్, భగవంతుడు నాయుడు, బాలరాజు యాదవ్ లకు, బాధితుడు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆరుద్ర సక్షత్ర పూజలు

**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం ఆరుద్ర సక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు.మర్గశిరం మాసంలో సోమవారంతో కూడిన ఆరుద్రనక్షత్రం రావడాన్ని చాలా పవిత్రంగా భావిస్తారు.అందుకోసమే ఈ దేవాలయంలో ఈ పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకుడు హరి శంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు కల్వనరేశ్ కుటుంబసభ్యులు,స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పోచమ్మదేవత వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**దేవరకద్ర, డిసెంబరు 16 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పుట్టపల్లిలో సోమవా రం గ్రామదేవత శ్రీ పోచమ్మదేవత నాభిశిల (బొడ్రా యి)వార్షిక బ్రహ్మో త్స వాలు ప్రారం భం అయ్యాయి.ఈ నెల 17 వరకు ఈ ఉత్స వాలు జరుగనున్నాయి.ఈ సంద ర్భంగా ఉత్స వాల మొదటి రోజు గుడి ముందు పచ్చని పంద రి వేసి విఘ్నేశ్వరపూజ కార్యక్రమంతో ఉత్స వాలకు శ్రీకారం చుట్టారు.ఈ పూజా కార్యక్రమాలకు గ్రామస్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు.అలాగే అమ్మవారి సన్నిదిలో పుణ్యాహవచనం, పంచగవ్యస్థాపణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి నట్లు నిర్వహకులు తెలిపారు.

**నేడు పుణ్యాహవచనం...**

గ్రామదేవత శ్రీ పోచమ్మదేవత నాభిశిల(బొడ్రాయి)వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా రెండవరోజు మంగళవారం పుణ్యాహవచనం పూజా కార్యక్రమంతో పాటు పంచగవ్యస్థాపణ,వాస్తు హోమం,రుద్రహోమం,మహాపుర్ణాహుతి,పోచమ్మదేవత నాభిశిల(బొడ్రాయి)అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

## సంతోష్ చారి కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ



సంతోష్ చారిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, డిసెంబరు16 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంతోష్ చారి మాతృమూర్తి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జడ్చర్లలోని సంతోష్‌చారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని మనోధైర్యం నింపారు. లక్ష్మారెడ్డి వెంట సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్,మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు రఘురాం,లత, నాయకులు పిట్టల మురళి, నాగిరెడ్డి, శ్రీకాంత్, కొండల్, సూరి తదితరులు ఉన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబైన హజ్రత్ సయ్యద్ రుస్తుం అలీషా దర్గా

**బిజినేపల్లి, డిసెంబరు16 ప్రభాతవార్త:** వట్టెం గ్రామంలో ఈనెల 20వ తేదీన హజ్రత్ ఖాజా సయ్యద్ మహమ్మద్ రుస్తుం అలీ షా చిస్తి మిర్జాయి ఖలందరి రహ్మతుల్లా అలై గారి ఆరవ ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతులు మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిస్తి మిర్జాయి ఖలందరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.వట్టెంలోని తమ నివాసం నుంచి 20వ తేదీ సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాలకు గంధం బయలుదేరి గ్రామపురవీధులకుండా ప్రధాన రహదారి వెంట సాయంత్రం దర్గా వద్దకు చేరుకోవడం జరుగుతుందన్నారు. రాత్రి పది గంటలకు దర్గా వద్ద గంధం సమర్పణ ప్రత్యేక ఫాతిహాలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారని పీఠాధిపతి తెలిపారు. సజ్జదే నషీన్ హజరత్ ఖాజా మహమ్మద్ సయ్యద్ అమీరొద్దీన్ చిస్తీ హఫీజ్ ఖారి సయ్యద్ శర్ఫొద్దీన్ చిస్తి ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 21వ తేదీన సాయంత్రం 7గంటలకు చిరాగా,నా తీయకార్యక్రమం తో పాటు మీలాద్ అనంతరం ఖవ్వాలి ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని వివరించారు. 22వతేదీన ఉదయం 8 గంటలకు ఖురాన్ పఠనం ఫాతిహా ఖతం ఖురాన్ అనంతరం ఖవ్వాలి, కార్యక్రమాలతోపాటు తీర్థ ప్రసాద వితరణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని దర్గా పీఠాధిపతి మహమ్మద్ ఖాజా అమీర్ అలీ చిస్తి మిర్జాయి ఖలందరి ప్రకటనలో పేర్కొన్నారు.

## యుటిఎఫ్ జిల్లా కార్యవర్గంలో మండల టీచర్లకు చోటు

**చిన్నచింతకుంట, డిసెంబరు16 ప్రభాతవార్త:** జిల్లాలోని జడ్చర్ల పట్టణంలో జరిగిన తెలం గాణ యుటిఎఫ్ ఆరవ మహాసభలు జరి గాయి. ఈ మహాసభలో యుటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా కమిటీలో మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చోటు దక్కింది. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులుగా ఉమాదేవి (పిఎస్‌బండర్‌పల్లి), ఆడిట్‌కమిటీ సభ్యులుగా ఎం.శంకరయ్య (జడ్పీహెచ్ఎస్ ఉంద్యాల), కుటుంబ సంక్షేమనిధి రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎం.శ్రీనివాస్ (జడ్పీహెచ్ ఎస్‌సిసి కుంట)లను ఎన్నుకున్నారు. వీరికి జిల్లా కమిటీలో స్థానం కల్పించినందుకుగాను యుటి ఎఫ్ మండల అధ్యక్షులు టి.రాములు, ప్రధాన కార్యదర్శి కన్నయ్య, సిసికుంట కాంప్లెక్స్ కన్వీనర్ ఎండి ఒవైస్, కార్యదర్శులు దస్తయ్య, కౌసల్య, హిమబిందు, సింధుజ, వినోద్, భావన హర్షం వ్యక్తం చేస్తూ కమిటికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి టౌన్ డిసెంబరు16 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణ కేంద్రంలోని 1వ వార్డు రాయిగడ్డలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను కాంగ్రెస్ నాయకులు మండ్ల దేవన్న నాయుడు పరిశీలించారు. సర్వే వివరాలను సర్వే జరుగుతున్న సిబ్బందిని అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండ్ల దేవన్న నాయుడు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బెడ్ రూమ్‌ల పేరుతో దందాలు కొనసాగించారని, ఏ వార్డుల్లో గాని ఒక్క గ్రామంలో పేదవాడికి ఇండ్లు మంజూరు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సంకల్పంతో పగడ్బందీగా అధికారులతో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్నారనీ పేర్కొన్నారు. ప్రజా నాయకుడు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి నియోజకవర్గంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను అందజే యాలని సంకల్పంతోముందుకెళ్తున్నారని హర్షం వ్యక్తం చేస్తూ దేవన్న నాయుడు ఎమ్మెల్యేకి కృతజ్ఞ తలు తెలిపారు. అర్హులందరూ ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి పొందేందుకు సర్వే సిబ్బందికి సహకరించి తమ తమవివరాలను మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేయించుకోవాలని దేవన్ననాయుడు సూచించారు.

## కోర్టు స్థలం వివాదం పరిష్కరించండి

**గద్వాల డిసెంబరు 16 ప్రభాతవార్త:** పదిరోజులుగా బార్ అసోసియేషన్ నాయకత్వంలో కోర్టు విధులు బహిష్కరించి గద్వాల న్యాయవాదులు చేస్తున్న నూతన కోర్టు భవనాల స్థల మార్పిడి డిమాండ్ న్యాయమైనదేనని ఈ సమస్య సత్వరం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. నూతన కోర్టు భవనాలు గద్వాల పట్టణానికి సుదూరంగా, కక్షిదారులకూ,ప్రజలకూ అందుబాటులో లేకుండా,ఏమాత్రం సౌకర్యం లేని పుడూరు శివారు, అనంతపురం గ్రామ గుట్టల వెనుక నిర్మించాలనుకోవడం అత్యంత అవివేక చర్య అన్నారు.కక్షిదారులకూ, ప్రజలకూ సౌకర్యవంతమై, అనుకూలతలతో ఉండే స్థలంలోనే నూతన కోర్టు భవన సముదాయాలు నిర్మించాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం గద్వాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది.గద్వాలకు సుదూరంగా కోర్టు భవంతులు నిర్మించాలనే అశాస్త్రీయ ఉత్తర్వులు రద్దుచేయాలని బార్ ఏకగ్రీవ నిర్ణయంలో భాగంగా న్యాయవాదులుపదిరోజులపైగా కోర్టువిధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. ప్రజాప్రతినిధులూ, ప్రభుత్వమూ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించకపోవడం బాధాకరమనీ, గద్వాల జిల్లా ప్రజల, కోర్టుకు వచ్చే కాక్షిదారుల ప్రయోజనార్థమై పూడూరు శివారు ఉత్తర్వులు రద్దు చేసి కక్షిదారులుగా కోర్టుకు పదిరోజులుగా వ్యయప్రాయాసాలతో వచ్చి మళ్ళి పోతున్న గ్రామీణ జన పరిస్థిని గమనం లోకి తీసుకుని, నావాదననే గెలవాలనే ఇగోలకు పోయి నూతన కోర్టు భవనాలు పట్టణానికి సమీపంలో జరగాలని చేస్తున్న డిమాండుకు ఆటంకాలు సృష్టిస్తున్న శక్తులను దూరం చేసి కాలయాపనకు తావులేకుండా సమస్య సత్వర పరిష్కారంలో భాగస్వాములు కావాలని ప్రజాప్రతినిధులకూ,ప్రభుత్వ అధికారులకూ బాధ్యత గల న్యాయవాదులకూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.ఇక్బాల్ పాషా, గద్వాల జిల్లా పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. ఏలీయా, జిల్లా కార్యదర్శి ఎండీ. దస్తగిరి, కార్యవర్గ సభ్యుడు ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

## దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

### - ఇదండీ దేవనాథ జీయర్ స్వామి



**కల్వకుర్తి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దైవచింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. సోమవారం చారకొండ మండలం గోకారం గ్రామంలో శ్రీకోదండ రాముని దేవాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. గోకారం గ్రామస్తులు భక్తులు ఆయనకు వాయిద్యాలతో, తాళమేళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలన్నారు. భారతదేశం కోసం, ధర్మం కోసం హిందూ మతం పనిచేస్తుందన్నారు. పాశ్చాత్య సంస్కృతిని వీడి భారతదేశ సనాతన ధర్మాన్ని పాటించవలసిన బాధ్యత ప్రతి పౌరులపై ఉందన్నారు. శ్రీ కోదండ రాముని దేవాలయం నిర్మాణం తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సాయంతో, వికాస తరంగిణి నల్లమల అచ్చంపేట వారికి ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. శ్రీ కోదండ రాముని దేవాలయం నిర్మాణకోసం పనిచేస్తున్న ఆలయ కమిటీని,నిర్వాహకులను అభినందించారు. అంతకముందు ఆయన అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాల్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు రామశర్మ, లక్ష్మణ శర్మ, మురళీ శర్మ, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పవదాల ఆంజనేయులు, నారోజు రామాచారి, బొడ్డుపల్లి రాములు, బొడ్డుపల్లి బ్రహ్మచారి,వెంకటేష్, దామర్ల తిరుపతయ్య,హరీష్, బాధగోని రామస్వామి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, భక్తులు గ్రామస్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవలే ఆనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి దశదినకర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయం మృతుని భార్యకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బావండ్ల మధు, నాయకులు మనోహర్ రెడ్డి, పుల్లరెడ్డి, బాలయ్య, తలసాని కృష్ణారెడ్డి, సంతోష మల్లేష్, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీశైలం,రామ్‌రెడ్డి, పాపాయ్యగ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### - మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, డిసెంబరు 16 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వలన ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డితో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏ వర్గం ప్రజలు తృప్తిగా లేరని, పూర్తిస్థాయిలో ఇచ్చిన 6 గ్యారంటీల అమలు కాలేదు ప్రధానంగా రెండు లక్షల రుణమాఫీ చేశామని చెబుతున్నారే కానీ రైతులఅకౌంట్లో డబ్బులు జమ కాలేదు ఇదే కాక రెండు లక్షల పైబడిన రుణాలు తీసుకున్న వారి రైతుల అకౌంట్లో ప్రభుత్వం చెల్లిస్తే మిగతా డబ్బులు రైతులే అప్పు చెల్లిస్తారని తెలిపారు. 2 లక్షల రూపాయల పైబడిన రుణాలు తీసుకున్న రైతులు రెండు లక్షల పోగా మిగతా డబ్బులు మొదటనే చెల్లించాలని తిరకాసు పెట్టడంపట్ల రైతులుఆందోళన చెందుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు జంగిలి యాదగిరి, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, లింగం ముదిరాజ్, పోలే అశోక్, శంకర్‌నాయక్, ఈదులపల్లి శ్రీను, వెంకటయ్య ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల వివరాల సేకరణలో వేగం పెంచాలి

### ● అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్



క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**వనపర్తి టౌన్ డిసెంబరు 16 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల వివరాల సేకరణలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తుంది. సోమవారం ఉదయం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పకడ్బందీగా సర్వే నిర్వహించడంతో పాటు సర్వే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో 750 కన్నా ఎక్కువ ఇళ్ళు ఉంటే మరో లాగిన్ సృష్టించి మరొకరికి సర్వే బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఉదయం పెద్దగూడెం, పెద్దగూడెం తాండాలో సర్వే పరిశీలించిన అదనపు కలెక్టర్ సాయంత్రం వనపర్తి మున్సిపాలిటీలోని బ్రహ్మంగారి విధి, కొత్తకోట మున్సిపాలిటీలో సర్వేను పరిశీలించారు.

# బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తుల పాదయాత్ర



రోడ్డు కోసం పాదయాత్ర చేస్తున్న గ్రామస్తులు

**మహమ్మదాబాద్ డిసెంబరు 16 ప్రభాతవార్త:** మండల పరిధిలో జూలపల్లి గ్రామ ప్రజలు జూలపల్లి నుండి నంచర్ల గేటు వరకు ప్రజా పాదయాత్ర నిర్వహించారు. నంచర్ల గేట్ నుండి జూలపల్లి వరకు వెంటనే బి టీ రోడ్డు వేయాలని ప్రజా పాదయాత్ర జరిగింది. ఈ పాదయాత్రకు మద్దతుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, జెడ్పిటిసి మాచారం శ్రీనివాస్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రాములు, మాజీ గ్రంథాలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, జూలపల్లి మాజీ సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి వై. లక్ష్మయ్యలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయకపోతే కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేసి ముట్టడి చేస్తామని, ఎమ్మెల్యే ఇంటి ముట్టడికైనా సిద్ధపడాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ రోడ్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైతే ప్రజలుఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రిని కలిసివినతిపత్రం ఇస్తామనిచెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ.నర్సింలు, జంబుల బాల్‌రెడ్డి, బోయిని రాజు, గొల్ల రాజు, జె.మధుసూదన్ రెడ్డి, పసుల రాజు, పాండు నాయక్, హరిచంద్ర నాయక్, గుండుమల నారాయణ, జోగు లాలయ్య, జుంటిపల్లి అంజయ్య, కొత్త కేశవులు, పసుల ఆంజిలయ్య, ఈడిగి రవి,కాశినాథ్, కె.బాలోజీ,పాండు,మహేష్, ముక్కు శీను, వై.చెన్నయ్య, మైబు, కే.సుగుణమ్మ, జి.పద్మ, కే.బాబమ్మ, తిరుపతమ్మ, అమృతమ్మ, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం



పడిపూజలో పాల్గొన్న నూకల విమల, శంకర్ బాబు దంపతులు

**లింగాల, డిసెంబరు16 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వాముల ఇరుముడి, పడిపూజ మహోత్సవ కార్యక్రమం లింగాల మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ అభినవ వీరమణికంఠ ఆలయంలో వైభవంగా నిర్వహించారు. దాదాపుగా అయ్యప్ప స్వాములు41 రోజులపాటు చన్నీటి స్నానమ చరించి దీక్షలు చేపట్టిన అయ్యప్ప స్వాములు సోమవారం మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీఅభినవ వీరమణికంఠ ఆలయంలో గురుస్వాములు భగవాన్,జెసిబి శ్రీనివాసులు తదితర గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి ధరించి శబమలైలోని అయ్యప్ప స్వామిని దర్శించు కోవడానికి తరలివెళ్లారు. ఆలయంలో అయ్యప్ప శరణుగోసలతో ఆలయమంతా మారుమోగింది.అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరాల మధ్య అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 మెట్లను వెలిగించి కర్పూర హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప భజన కీర్తనలతో మారుమోగింది. అత్యంత కన్నుల పండువగా సాగిన ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు. ఆలయంలో అయ్యప్ప కీర్తనలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సాయంత్రం స్వాములు శ్రీశ్రీశ్రీఅభినవ వీరమణికంఠ ఆలయం నుంచి ఇరుముడి తలపై ధరించిన,పూరవీధుల గుండా భక్తీ కీర్తనలు పాడుతూ శ్రీకోదండరామస్వామిని దర్శించుకొని,అక్కడి నుంచి బోడ్రాయి అమ్మవారిని దర్శించుకొని శబరిమలై తరలివెళ్లారు.

భక్తులకు నూకల విమల,శంకర్‌బాబు దంపతులుఅన్నదానం: మండల పరిధిలోని ధారారం గ్రామానికి చెందిన నూకల విమల, శంకర్ బాబు దంపతులుభక్తులకు శ్రీశ్రీశ్రీ అభినవ వీరమణికంఠ ఆలయంలో అన్నదానం కార్యక్రమంఏర్పాటు చేశారు. అంతకుముందు ఆలయంలో పడిపూజలోపాల్గోనిస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## రైతు భరోసా పథకాన్ని కొనసాగించాలి

**కృష్ణ, డిసెంబరు 16 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా భూమి ఉన్న ప్రతి రైతుకు కేవలం ఐదు ఎకరాలకు మాత్రమే ఇవ్వాలని కృష్ణ మండల బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీని వాసులు ప్రభుత్వాన్ని కోరారు. పింఛన్లు, రైతు భరోసా పథకాలను ఏ ప్రభుత్వం వచ్చిన కొనసాగించాలని అన్నారు. అదే విధంగా రెండు లక్షలపైన ఉన్న రుణమాఫీ పై అసెంబ్లీ సమావేశాలలో స్పష్టమైన తేదీ ప్రకటించి రైతులకు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు భరోసా వర్షాకాలం యాసంగి పంట ప్రారంభ దశలో (సకాలంలో) రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని అన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో నోట్ బుక్స్ పంపిణీ

**నారాయణపేట టౌన్, డిసెంబరు16 ప్రభాతవార్త:** సోమవారం రోజు నారాయణపేట పట్టణంలోని బీసీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో 40 నిరుపేద పిల్లలకు జనతా గ్యారేజ్ వాట్సాప్ సభ్యుల ఆధ్వర్యంలో పలకలు నోటుబుక్కు, పెన్నులు,పెన్సిల్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మానవ సమాజం విద్య ద్వారానే ఉత్తమమైన ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. విద్యాదానం మహాదానం అన్నారు.ఈ కార్యక్రమంలో జనతా గ్యారేజ్ గ్రూప్ సభ్యులు రెహమాన్, అంగన్‌వాడీ టీచర్, హెల్పర్, అంగన్‌వాడీ కేంద్రం పిల్లలు ఉన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## నక్షబాట ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబరు16 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని చొక్కనపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే నక్ష బాటను గ్రామానికి చెందిన కుడుముల లింగారెడ్డి నక్ష బాటను ఆక్రమించుకున్నాడని సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో తహసిల్దార్ కార్తీక్‌కుమార్‌కు రైతులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్షబాటను ఆక్రమించుకున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాటను పునరుద్ధరించాలని పొలాలకు వెళ్లడానికి గత ఆరు నెలల నుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ వై.శేఖర్ రెడ్డి, రైతులు జంగయ్యయాదవ్, శశిధర్ రెడ్డి, పెద్దయ్య, వెంకటయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## చెవిలో పువ్వులతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



చెవిలో పువ్వుతో నిరసన తెలుపుతున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీ పార్క్ వద్ద చేపట్టిన ధర్నా సోమవారం ఐదవ రోజుకు చెరుకుంది. చెవిలో పువ్వులు ఉంచుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.మహిళలకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలి, ఆరోగ్యభీమ, జీవిత భీమా రూ.25 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలన్న న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నామని ఇప్పటికైన ప్రభుత్వం మమ్మల్ని గుర్తించి మా న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలోఎల్లాగౌడ్,గౌరమ్మ,అల్తాఫ్, అన్వర్,రాజు,మనోహర్,నవీన్,యుగంధర్, అనిత,రవి,నరేష్ మగనూరు పిఆర్టియూ నాయకులు మరియు సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు దారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

డాక్యుమెంట్ వివరాలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ లు రోజుకు 5శాతం దరఖాస్తులు విధిగా పరిశీలించాలని సూచించారు. ఒక గ్రామంలో 750 కంటే ఎక్కువ దరఖాస్తులు ఉంటే అదనంగా మరో లాగిన్ తీసుకోవాలని సూచించారు. ప్రజాపాలన ద్వారా వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోరుచు 142,075 మంది దరఖాస్తులు చేసుకోగా ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు 390 మందికి లాగిన్ ఇవ్వడం జరిగింది. ఒక్కొక్కరు రోజుకు కనీసం 25 ఇళ్ళు సర్వే చేయాలని సూచించారు. అవసరమైతే మరిన్ని లాగిన్ ఇస్తామని అదనపు కలెక్టర్ తెలియజేశారు. జడ్పి సీఈఓ యాదయ్య, డియల్పిఓ రఘునాథ్, ఎంపీడీఓ లు, ఎంపిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## వణికిస్తున్న చలి పులి

### ◆ బిజినపల్లి మండలంలో 9.7 అత్యల్ప ఉష్ణోగ్రతలు

**బిజినపల్లి డిసెంబరు16 ప్రభాతవార్త:** మండలంలో చలి తీవ్ర రూపం దాల్చుతున్నది. నాగర్ కర్నూల్ జిల్లాలోనే బిజినపల్లి మండలంలో 9.7 అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్‌లో చలి తీవ్రత వెల్లడించారు. ఉదయం, రాత్రి వేళల్లో చలితీవ్రతకు తోడు చల్ల గాలులువీస్తుండడంతో ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో చిన్నా రులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. కాగా,చలికాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## ఘనంగా పాల ఉట్ల ఉత్సవం

**మక్తల్, డిసెంబరు16 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో వెలసిన శ్రీపడమటి ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పాల ఉట్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సమీపంలోని రామ్‌లీలా మైదానం వద్ద ఏర్పాటు చేసిన పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కి ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. అశేషంగా తరలి వచ్చిన భక్త జన కేరింతల మధ్య ఉట్టిని అందుకొని భక్తుల్లో ఉత్సాహం నింపారు.అంతకుముందు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునే ఆలయంలో బారులు తీరారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సందెపు రాళ్ల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి వెండి కడియాలను బహుకరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కట్టసురేష్, కొండయ్య,రాజుల అశిరెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**పెబ్బేరు డిసెంబరు 16 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం రోజు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ఆదేశాల మేరకు ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి సీఎంఆర్ఎఫ్ 18 మందికి నాలుగు లక్షల98000 రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. బాధితులు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక పెద్ద మొత్తంలో ఎంఆర్ఎఫ్ చెక్కులు ఇంటికి పెద్ద కొడుకులాగా సలహాయపడుతుందని బాధితులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కార్పాకులవెంకటరమణ యాదవ్, నాయకులు రాంపురం సహదేవుడు, వీరస్వామి జయసింహారెడ్డి విజయ్‌గౌడ్, హరి కుమార్‌రెడ్డి రణధీర్‌రెడ్డి రాజనాయక్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి

**పెబ్బేరు డిసెంబరు16 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో సోమవారం రోజు శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి సందర్భంగా ఉదయం అభిషేకం గణపతి హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 138 మంది అయ్యప్ప స్వాములు 41 రోజు మండల కాలం పాటు దీక్షపూర్తి చేసుకుని శబరిమల యాత్ర ఇరుముడితో బయలుదేరారు. కూర్చున్న భక్తులకు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## విద్యుత్తు వైర్, స్టార్టర్లను దొంగిలించిన గుర్తుతెలియని వ్యక్తులు

**బాలానగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఆదివారం రాత్రిగుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన సింగపోగు రమేష్, సింగపోగు నాగయ్యలకు చెందిన మోటర్ కేబుల్ వైర్లు,2 స్టార్టర్లను దొంగిలించారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే తమకు నష్టం కలిగించే విధంగా గుర్తు తెలియని వ్యక్తులు కరెంటు సామాను దొంగిలించడం బాధాకరం అన్నా రు. దొంగిలించిన సామాన్లవిలువ దాదాపు రూ.15000 ఉంటుందని,ఈ సంఘటనపై రాజాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

## ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులు మంజూరు

**పెబ్బేరు డిసెంబరు16 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలానికి ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి 8గ్రామాలకు గుమ్మడం,తోమాలపల్లి, సుగురు, తిప్పాయిపల్లి,బునియాదిపూర్, రంగాపూర్, కొత్తసుగుర్, యాపర్ల ఒక్కొక్క గ్రామానికి 5లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.గాను 45లక్షలు సిసి రోడ్డుల నిర్మాణం కోసం మంజూరు చేసినట్లు,ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధె లక్ష్యంగా నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యేకి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ,మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, రంజిత్ కుమార్, రాములు యాదవ్ తదితరులుకాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియచేసారు.

## కడపరాయ రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ

**ధన్వాడ, డిసెంబరు16 ప్రభాతవార్త:** ధన్వాడ మండలం గున్ముక్ల కడపరాయ రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది సోమవారం తెల్లవారుజామున భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథం లాగారు. గోవింద నామస్మరణతో దేవాలయ ప్రాంతం మారుమ్రోగింది.రథోత్సవం కన్న ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పూనకాల మధ్య రథోత్సనం కొనసాగింది. రథం విద్యుత్ దీపాలు,పూలతో అలంకరించారు.వివిధ ప్రాంతం నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించు కున్నారు.మాజీ ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి కడపరాయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో మన్నెశ్రీనివాస్‌రెడ్డికి ఘనస్వాగతం పలికి సన్మానించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గత రెండు రోజులుగా నిర్వహించిన గ్రూప్2 పరీక్షలు నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రంప్రశాంతంగా ముగిశాయి.రెండో రోజైన సోమవారం ఉదయం సెషన్‌లోజరిగిన పరీక్షకు మొత్తం 3994 మంది అభ్యర్థులకుగాను, 2015మంది హాజరు కాగా, 1979మంది గైర్హాజరు అయ్యారు.ఉదయం సేషన్‌లో 50.45 హాజరు శాతం నమోదయింది.సోమవారం మధ్యాహ్నం సెషన్ పరీక్షకు మొత్తం3994 మంది అభ్యర్థులకుగాను, 2016 మందిహాజరు కాగా,1978మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కిగాను 50.48 హాజరు శాతం నమోదయింది.

**బిజినేపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త :** మండలంలో గ్రూప్ 2పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. హాల్ టికెట్లు, అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం సెంటర్లలోకి అనుమతించారు. బిజినపల్లి మండలంలో మొత్తం 1638 అభ్యర్థులకుగాను 802 అభ్యర్థులు హాజరవగా, 836 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద జిల్లా అధికారులు తనిఖీ చేసి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్,డిసెంబరు 16 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామం హరిజన వాడలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా సర్వే కొనసాగుతోందని ప్రతిరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్‌లైన్ విధానం ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారం క్షేత్రస్థాయిలో సేకరించాలని సిబ్బందికి సూచించారు. హరిజన వాడలోని రెండు నివాసాల వద్ద ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలా జరుగుతుందని ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదర్శన్, ఈడిఎం విజయ్, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

**నారాయణపేట టౌన్,డిసెంబరు16 ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి మొత్తం 07 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సిఐ, ఎస్సైలకు సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఫిర్యాదుదారులకు సూచించారు. భూములకు సంబంధించి గొడవలు పెట్టుకోరాదు అనిఅందరూ సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి కోరారు. అధికారులు బాధితులు తీసుకొచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్లో ఉంచరాదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఫిర్యాదులు పెండింగ్లో ఉంటే వాటికి సంబంధించిన సమాచారాన్ని బాధితులకు తప్పకుండా తెలపాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, పోలీసులు ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు. ప్రస్తుతం అధునాతన టెక్నాలజీ పెరుగుతున్నందున సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి కావున ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## ప్రజావాణికి 21 దరఖాస్తులు

■ ప్రజావాణి వినతులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 21 ఫిర్యాదులు వచ్చాయని, అట్టి అర్జీలను వెంటనే పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధితశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఏడి సర్వే ల్యాండ్ కు 3 ఫిర్యాదులు, డిఆర్డిఏకు 2, ఉపాధి కల్పనకు 2, జిల్లా శిశు సంక్షేమ శాఖకు 2, విద్యాశాఖ, లేబర్, ఎల్డీఎం, పోలీస్ శాఖలకు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు అందాగా మిగిలిన ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్ చేన్న కిష్టయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలమర్రి పిలుస్తోంది..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కలెక్టర్ రోనాల్డ్‌రోస్ పిల్లలమర్రి నిర్వహణ బాధ్యతలను టూరిజం శాఖ నుంచి అటవీశాఖకు బదలాయించారు. పిల్లలమర్రిని కాపాడేందుకు 2018నుంచి అధికారులు నిర్విరామంగా శ్రమిం చారు. వివిధ దశల్లో పర్యవేక్షణ పనులు కొనసాగాయి. ప్రజలు మహా వృక్షం వద్దకు వచ్చినా తకకుండా ఉండేలా చుట్టూ గోడ నిర్మించారు. సందర్శకుల కోసంఫుట్ ఓవర్ బ్రిడ్జినిర్మించారు. చెట్టుకొమ్మలకు డ్రిల్లింగ్ చేసి క్లోరోఫైరిసిస్ ద్రావణాన్ని రంధ్రంలోకి పంపించి చికిత్స అందించారు. చెట్ట కొమ్మలు బలహీనంగాఉండడంతో పడిపోకుండా కాంక్రీట్‌స్తంభాలతో సపోర్ట్ ఇచ్చారు. అదేవిధంగా పైపులతో రెండుసుమారు 150కిపైగా ఊడలు భూమిలోకి ఊడలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

**పర్యాటకంగా అభివృద్ధి:** ప్రపంచంలో రెండో అతిపెద్ద మహావృక్షం..700ఏళ్ల ఘన చరిత్ర దాని సొంతం. నాలుగేళ్ల క్రితం ఊడలు ఊడిపోవడం,ఆకులు ఎండిపోవడంతో మోడుబారింది. కానీ.. ఆకులన్ని రాలిన చోటే కొత్త చిగురు వికసించింది. ఒదిగిన చోటే ఎదిగి నా చరిత్ర ముగియలేదని నిరూపించింది. ఏడు శతాబ్దాల చరిత్రగల...పాలమూరు ఐకానిక్ పిల్లలమర్రి మళ్లీజీవం పోసుకుంది.గత నాలుగేండ్లుగా పర్యాటకులకు అనుమతి లేకపోవడంతో చూడలేకపోయారు. అయితే ఇటీవలే మహావృక్షం చికిత్స పొంది మళ్లీ పునర్జీవం పోసుకున్న నేపథ్యంలో గత మూడు నెలల కిందట పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యాటకాన్ని ప్రారంభించారు.దీంతో అప్పటినుంచి పర్యాటకులకు అనుమతి లభించింది. అదేవిధంగా ప్రత్యేకంగా ఒక పార్కు కూడా ఏర్పాటు చేశారు. పిల్లల కోసం వాల్ పెయింటింగ్ కూడా సిద్ధం చేశారు.తన చరిత్ర ముగియలేదని, మళ్లీ పునర్జీవం పోసుకొని పర్యాటకులను ఆకర్షిస్తున్నది.



భారీ కొమ్మలకు సపోర్ట్‌గా కర్రలను ఏర్పాటు చేసిన దృశ్యం









పిల్లలమర్రి వద్ద పర్యాటకుల సందడి



# వీపనగండ్ల అంబులెన్ ఎక్కడ?

◆ ప్రభుత్వం కేటాయించినా ప్రారంభానికి నోచుకోలే..

◆ దశాబ్ద కాలంగా గాలిలో దీపంలా అత్యవసర సేవలు

◆ మంత్రిగారూ స్పందించండి అంటూ మండల ప్రజల వేడుకోలు

**వీపనగండ్ల, డిసెంబరు 16, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత తొమ్మిదేండ్లుగా 108 అంబులెన్స్ కావాలని ఈ ప్రాంతంలోని ప్రజలు ఎన్నోసార్లు ఆందోళన చేసినా ఫలితం మాత్రం లేకపోయింది. అయితే ఇటీవల వనపర్తి జిల్లాకు అంబులెన్స్ 5మంజూరు కాగా వాటికి కేటాయించిన మండలాలకు రిజిస్ట్రేషన్ నెంబర్లతో సహా పంపించారు.వాటిలో ఎంపీడీఓ ఆఫీస్ చిన్నంబావి టిజి08 టి5931, సిహెచ్‌సి ఘణపురం టీజీ08 టి5932,పిహెచ్‌సి పెద్దమందడి టీజీ08టి5933,పీహెచ్‌సీ శ్రీరంగాపురం టీజీ08టి 5934, సిహెచ్‌సి వీపనగండ్ల టీజీ08టి5935 నెంబర్లతో కేటాయించడం జరిగింది. వాటిలో కొన్ని మూడింటినీ ఇదే స్థానాలకు కేటాయించగా రెండు మాత్రం తిరిగి వాపస్ వెళ్లినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల కిందట మంత్రి జూపల్లి కృష్ణారావు మూడు అంబులెన్సులను కొల్లాపూర్‌లో ప్రారంభించారు. అయితే వనపర్తి జిల్లాకు కేటాయించిన 5 అంబులన్స్‌లల్లోమూడు ప్రారంభం కాగా పెద్దమందడి, వీపనగండ్లకు మాత్రం ప్రారంభించలేదు.

**పెద్ద సారూ స్పందించండి:** వీపనగండ్ల మండలంలో అత్యవసరంలో అంబులెన్స్ సేవలు అందక ఎన్నోసార్లు ప్రాణాపాయ స్థితికి చేరుకున్న సంఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తూ అంబులెన్స్ కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. జిల్లా కేంద్రానికి దూరప్రాంతం అయినందునా వీపనగండ్లలో 30పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నది. దీనికి అనుసంధానంగా అంబులెన్స్ లేకపోవడం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. అనుకోకుండా ఇక్కడ కాన్పుకు వచ్చే మహిళలు కానీ, గుండెపోటు, పాము కాటుకు గురై వచ్చే వారు ఇతరత్రా అత్యవసర వైద్యం కోసం వచ్చే వారికి ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చినటువంటి 108 అంబులెన్స్‌ను తిరిగి ఇక్కడే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇదే హాస్పిటల్‌కు సుగుణ పౌల్ట్రీ వారి సౌజన్యంతో కొత్త అంబులెన్స్‌ను కలెక్టర్ ద్వారా కేటాయించగా అదీ వీపనగండ్లకు చేరలేదని చెబుతున్నారు.ప్రైవేట్ అంబులెన్స్ కావడంతో రూ.1500 డీజిల్ ఖర్చు భరించాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అదికూడా అందుబాటులో లేకపోవడం బాధాకరంగా ఉందని అంటున్నారు. మంత్రి సారూ అత్యవసర అవసరాలకు అంబులెన్స్ లేకపోవడం చాలాఇబ్బందులు పడుతున్నామని అంబులెన్స్ కేటాయించాలని కోరుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 24 ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అంబులెన్సు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా ఇక్కడ మాత్రం అమలుకు నోచుకోవడం లేదని, స్పందించి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన 108 అంబులెన్స్

# పేట వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల ఆందోళన

■ దళారి వ్యవస్థను రూపుమాపాలన్న రైతులు

**నారాయణపేట టౌన్, డిసెంబరు16 ప్రభాతవార్త:** పేట వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన కందులకు ఒకేసారి ధరలు తగ్గించడంతో గిట్టుబాటు రేటు అందించాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ ముందు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత రెండు రోజుల కిందట ఉన్న ధరలకు నేటి ధరలకు 2500 నుండి 3000 వరకు ఒకేసారి ధర తగ్గించడం సమంజసం కాదన్నారు. టెండర్ రెండు గంటలకే రావాల్సి ఉండగా సాయంత్రం నాలుగు గంటల టెండర్లు రావడం లేదన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్న పట్టించుకునేవారు లేరు. రోజు రోజుకు మార్కెట్లో దళారి వ్యవస్థ పెరుగుతున్న పట్టించుకునే వారు లేరన్నారు. ఒకే పొలంలో పండిన కంది పంటకు వేరు వేరు గ్రేడ్ వేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. రైతు రాజ్యంలో రైతులకు మోసం చేయడం తప్ప న్యాయం జరగడం లేదన్నారు. గిట్టుబాటు ధర విషయంలో న్యాయమైన ప్రకటన వచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు, సిపిఎం, భారతీయ కిసాన్‌సంగ్ నాయకులు పట్టు పట్టారు. తమ చేతిలో ఏమీ లేదంటూ వ్యాపారవేత్తలతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ చేతులెత్తేశారు. రైతుల ఆందోళన ఎనిమిది గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో రైతులతో బాటు తదితరులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

## డీఎంహెచ్ఓ, డిఆర్డిఓ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు16 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం చౌరస్తా వద్ద గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని, పక్కనే ఉన్న డిఆర్‌డిఓ కార్యాలయాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్ అక్కడి స్టాఫ్ హాల్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారి గదిని చూశారు. గదిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని లేకపోవడంతో ఇంకా రాలేదా ? అని కలెక్టర్ అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా మక్తల్ నియోజక వర్గంలోని కర్ని గ్రామానికి డీఎంఅండ్ హెచ్ ఓ విజిట్ కు వెళ్లిందని సిబ్బంది తెలిపారు. మిగతా స్టాఫ్ ఎవరెవరు వచ్చారని అడిగి తెలుసుకున్న కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్‌ను తీసుకుని ఎవరెవరు వచ్చారు? ఎవరెవరు రాలేదో పరిశీలించారు.కార్యాలయంలో కొందరూ ఉద్యోగులు డిప్యూటేషన్ పై వెళ్లారని, మరి కొందరు గ్రూప్ 2 పరీక్ష కు వెళ్లినట్లు అక్కడి సిబ్బంది కలెక్టర్ కు తెలిపారు. కార్యాలయానికి వచ్చిన వారందరితో ఎవరెవరు ఏ ఏ పని చేస్తున్నారని, వాళ్ళ డెజిగ్నేషన్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న డిఆర్డిఏ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేయగా అక్కడ కూడా డిఆర్డిఓ, అడిషనల్ డిఆర్డిఓ గదులు మూసిఉన్నాయి. కార్యాలయంలో చాలా కుర్చీలు ఖాళీగానే ఉండటంతో కార్యాలయ హాజరు రిజిస్టర్‌ను చూసి, విధులకు హాజరైన సిబ్బందితో ఆమె మాట్లాడారు. చాలా మంది కార్యాలయానికి ఎందుకు రాలేదని సెలవు పెట్టారా అని కలెక్టర్ ప్రశ్నించారు. గ్రూప్ 2 పరీక్షకు వెళ్లారని సిబ్బంది చెప్పడంతో అందరూ పరీక్షకు వెళ్ళారా అని నిలదీశారు. అలాగే సెర్ప్ విభాగాన్ని తనిఖీ చేసి అక్కడి ఉద్యోగుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.సెర్ప్ విభాగంలో ఇద్దరు డీపీఎంలు,ఒకసీసీ ఉండటంతో ఎవరెవరుఏఏవిధులు నిర్వహిస్తారని అడిగి తెలుసుకున్నారు.



ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

## కలుషిత జలాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ముదిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదలడం జరిగిందని, ఆగష్టు, అక్టోబర్ మాసాల్లో దీనికి సంబంధించిన వార్తలు ఆధారాలు, ఫోటోలతో సహా ప్రముఖ మీడియాలోనూ వచ్చాయని ప్రస్తావిస్తూ వాటికి సంబంధించిన క్లిప్పింగ్‌లను స్పీకర్‌కు చూపించారు. ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు కాలుష్య మండలి అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారి ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చారని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. గతంలో రెడ్ కేటగిరీకి చెందిన ఒక పరిశ్రమ విషయంగా తాను కోర్టుకు వెళ్లి దాన్ని తరలించాలని కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చినా వాటిని అమలు చేయలేదని పేర్కొన్నారు.అరబిందో కలుషిత జలాల విషయంగా చర్యలు తీసుకోవాలని, దాని కారణంగా నష్టపోతున్న ముదిరాజ్ బిడ్డలకు న్యాయం చేయాలని అనిరుధ్ రెడ్డి కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ, అనిరుధ్‌రెడ్డి చెప్పిన విధంగా ఆగష్టు 24, అక్టోబర్ 26న అరబిందో కలుషిత జలాలపై వచ్చిన వార్తల విషయాన్ని పరిశీలిస్తామని, ఈ విషయంగా వ్యవసాయ శాఖ నుంచి నివేదిక కోరుతామని చెప్పారు. కాలుష్య మండలి నిబంధనలు అమలు చేయడంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల్లో 2వ రోజు సోమవారం ఉదయం పెపర్-3, మధ్యాహ్నం పేపర్4 నిర్వహించగా గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం ఉదయం నాగర్ కర్నూల్ పట్టణంలోని సాధన డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న రెండోవ రోజు గ్రూప్-2 మూడవ పేపర్ పరీక్షా కేంద్రాన్ని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించి, పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతవాతావరణంలో పరీక్షల నిర్వహణ సందర్భంగా (32) పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ అమలు చేశారన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా ప్రశాంతంగా కొనసాగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 32 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 9731 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా సోమవారం పేపర్-3కు ఉదయం4699 మంది హాజరయ్యారన్నారు. 5032 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు అయ్యారని,48శాతం హాజరు శాతం నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన4వ పేపరుకు 4699 మంది అభ్యర్థులు హాజరు కాగా 5032 మంది అభ్యర్థులుగైర్హాజరు అయినట్లుతెలి పారు. జిల్లాలో గ్రూప్-2పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. మొత్తంగా జిల్లాలో రెండు రోజులుగా జరిగిన గ్రూప్ టు పరీక్షల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలియజేశారు.

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 16 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల్లో రెండవ రోజు సోమవారం ఉదయం పెపర్ 3, మధ్యాహ్నం పేపర్ 4 నిర్వహించగా పరీక్షలు పకడ్బందీగా ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు ఉదయం వనపర్తి పట్టణంలోని చాణక్య హైస్కూల్ సెంటర్ కోడ్ 4109, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెంటర్ కోడ్ నెంబర్ 4110 ను సందర్శించి పరిశీలించగా మధ్యాహ్నం పరీక్షలను అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ కొత్తకోట మున్సిపాలిటీలోని ఉషోదయ టాలెంట్ స్కూల్ లో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలను పరిశీలించారు. సోమవారం జిల్లాలోని 31 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8569 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా పేపర్3కు ఉదయం 4329 మంది హాజరయ్యారు. 4240 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు.ఉదయం 50.52 హాజరు శాతం నమోదు అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 4వపేపరుకు 4288 మంది అభ్యర్థులు హాజరు కాగా4281 మంది అభ్య ర్థులు గైర్హాజరు అయినట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జిల్లాలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పరీక్షలుప్రశాంతంగా ముగిసినట్టు తెలియజేశారు.



మాట్లాడుతున్న గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, డిసెంబరు 16 ప్రభాతవార్త:** ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ నేడు ఒక ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతవాతావరణంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని, పరీక్షల నిర్వహణ కొరకు 25 పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ తో పాటు అన్ని రకాల ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 8722 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, మొదటి రోజు ఆదివారం రెండు సెషన్ల లో పరీక్షకు 49.48 శాతం మంది హాజర య్యారు. ఇక రెండవ రోజు సోమవారం రెండు సెషన్లలో 48.06 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.



పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 16 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణ లో గ్రూప్2 పరీక్ష నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి సందర్శించారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ డైట్ కళాశాల, ప్రభుత్వ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ తనిఖీ చేశారు.అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో మౌలిక సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

**నారాయణపేట టౌన్, డిసెంబరు 16 ప్రభాతవార్త:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గత రెండు రోజులుగా నిర్వ హించిన గ్రూప్2 పరీక్షలు నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రంప్రశాంతంగా ముగిశాయి.రెండో రోజైన సోమవారం ఉదయం సెషన్‌లోజరిగిన పరీక్షకు మొత్తం 3994 మంది అభ్యర్థులకుగాను, 2015మంది హాజరు కాగా, 1979మంది గైర్హాజరు అయ్యారు.ఉదయం సెషన్‌లో 50.45 హాజరుశాతం నమోదయింది. సోమవారం మధ్యాహ్నం సెషన్ పరీక్షకు మొత్తం3994 మంది అభ్యర్థులకు గాను, 2016 మందిహాజరు కాగా,1978 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కిగాను 50.48 హాజరు శాతం నమోదయింది.

**బిజినేపల్లి, డిసెంబరు 16 ప్రభాతవార్త :** మండలంలో గ్రూప్2పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. హాల్‌టికెట్లు, అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం సెంటర్లలోకి అనుమతించారు. బిజినపల్లి మండలంలో మొత్తం 1638 అభ్యర్థులకుగాను 802 అభ్యర్థులు హాజరవగా, 836 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. సెంటర్ల వద్ద జిల్లా అధికారులు తనిఖీ చేసి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.



గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్